సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్రైస్తవుల శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలి


వినతిపత్రం అందిస్తున్న మైనారిటీ నాయకులు

మహారాణిపేట: క్రైస్తవుల శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని, సమాధుల చుట్టూ ప్రహరీ నిర్మించాలని బీజేపీ మైనారిటీ నాయకులు, క్రిస్టియన్ సిమెట్రీస్ నాయకులు కోరారు. సోమవారం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపికను వారు కలిసి వినతిపత్రం అందించారు. బర్మా క్యాంప్‌లోని శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలని, క్రైస్తవుల సమాధుల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ప్రత్యేక గేటు ఏర్పాటు చేసి మెయింటెనెన్స్ ఇవ్వాలని బీజేపీ నాయకులు సిహెచ్.రాజబాబు, ఒ.ఆల్బర్ట్ కోరారు. జీవీఎంసీ జోన్ 4–5 క్రిస్టియన్ సిమెట్రీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ అధ్యక్షుడు ఎం.దేవానంద్, ప్రధాన కార్యదర్శి వారా జాకబ్, సంయుక్త కార్యదర్శి బచ్చు రాజు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

వారాహి అమ్మవారికి అమావాస్య పూజ


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: అమావాస్య సందర్భంగా సోమవారం సాయంత్రం అల్లిపురం సాయిదర్బార్‌లో వెలసిన వారాహి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ముందుగా విఘ్నేశ్వర పూజ, మండపారాధన, దీపారాధన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా వారాహి మాతను వివిధ రకాల సుగంధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

ఉక్కు కార్మికుల సమ్మె ఉధృతం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. దీనిలో భాగంగా కర్మాగారంలోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న కార్మికులంతా సమ్మెలో పాల్గొంటున్నారు. వారికి మద్దతుగా విశాఖలోని ఇతర కార్మిక సంఘాలు కూడా నిలుస్తున్నాయి. దీంతో కూర్మన్నపాలెం ముఖ్యకూడలి సోమవారం కార్మికుల ఆందోళనలు,నినాదాలతో మార్మోగిపోయింది. విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం అఖిల పక్ష కార్మిక సంఘాలు పోరాట కమిటీగా ఏర్పడి చేపట్టిన దీక్షకు సోమవారం నాటికి 1500 రోజులు పూర్తయింది. ఇదిలా ఉండగా కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. మొదట్లో కొంత స్తబ్దంగా ఉన్నా రాష్ట్రస్థాయి పెద్దలు మద్దతు పలకడంతో రోజు రోజుకు బలోపేతం అవుతోంది. సమ్మెకు వైఎస్సార్‌సీపీతో పాటు వామపక్ష పార్టీలు మద్దతు తెలపడంతో ఆందోళనలో పాల్గొంటున్న కార్మికుల సంఖ్య గణనీయంగాపెరుగుతోంది.

పోర్టు ఎస్సీ, ఎస్టీ సంఘం నూతన కార్యవర్గం కొలువు



ఉమామహేశ్వరరావు దేవీశ్వరరావు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టీఎస్ దీప్తి, కె.వేణుగోపాల్, ఈ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్‌ను, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, సిద్ధార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.ఎస్.రావు, బూరి శ్రీను, సంజీవరావు, కె.వి.రమణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.ఎన్.ఎస్.ఎస్. సింగ్ ఆధ్వర్యంలో పోర్టు అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సర్వరోగ నివారిణి.. వాకింగ్


వైఎస్సార్ సెంట్రల్ పార్కులో వాకర్ల హుషారు నడక

డాబాగార్డెన్స్: నేటి ఆధునిక కాలంలో పెద్దగా శ్రమపడని వారు తప్పనిసరిగా వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. గతంలో మన పెద్దలు ఇంటి పని.. ఇతర పనులను స్వయంగా చేసుకోవడం.. కిలోమీటర్ల కొద్దీ నడవడం వల్ల వారికి పెద్దగా వ్యాయామం అవసరం ఉండేది కాదు. కానీ మనం ఎటువంటి శారీరక శ్రమ లేకుండా బతుకుతున్నాం. కనుక నేటి మానవుడికి తప్పకుండా వ్యాయామం.. వాకింగ్ వంటివి అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

సర్వోత్తమమైనది నడక..

నడక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. నడక అన్ని ఫిట్‌నెస్ స్థాయిలకు అనువైన వ్యాయామం. హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు నిర్వహణలో సహాయపడుతుంది. కండరాలు, కీళ్లను బలపరుస్తుంది. మానసిక శ్రేయస్సును, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మార్నింగ్ వాక్ చేయడం వల్ల కాలు, పొత్తి కడుపు కండరాలు టోన్ అవుతాయి. 30 నిమిషాల రోజువారీ శక్తివంతమైన ఉదయపు నడక ఎముకల సాంద్రతను మెరుగుపరుస్తుంది. కీళ్లను ద్రవ పదార్థంగా ఉంచుతుంది. కండరాలు బలపరుస్తుంది. వృద్ధాప్యంలో ఆర్థరైటిస్, ఎముకల వ్యాధి, ఇతర బలహీనపరిచే పరిస్థితుల నుంచి ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

నేటి ఆహారపు అలవాట్లే కారణం..

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వాతావరణంలో మార్పుల కారణంగా ఊబకాయం, షుగర్, బీపీ, నరాల బలహీనత, కండరాల బలహీనత వంటి అనేక వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రజలు వ్యాయామం, నడకపై దృష్టి సారించారు. నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగాల బారిన పడిన రోగులు మందులతో సరిపెట్టుకోకుండా నిత్యం వాకింగ్ చేస్తే మంచిదని చెబుతున్నారు. నేటి ఆహారపు అలవాట్లు, జీన్స్ కారణంగా ఊబకాయం సమస్య తీవ్రతరమైంది. ఇటువంటి దశలో వైద్యుడిని సంప్రదిస్తే నడవమని సూచిస్తున్నారు.

నడకకు ప్రాధాన్యం..

నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సెంట్రల్ పార్క్, సరస్వతీ పార్క్, బీచ్‌రోడ్డు, ఇందిరా ప్రియదర్శినీ మున్సిపల్ స్టేడియం, లక్ష్మీటాకీస్ పార్క్, డైమండ్ పార్క్, మెయిన్‌రోడ్డులో నిత్యం వేలాది మంది యువత, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వాకింగ్ చేస్తున్నారు. సమయాన్ని బట్టి ప్రతి ఒక్కరూ వాకింగ్‌పై దృష్టి పెడుతున్నారు. ఉదయం వాకింగ్ వల్ల సూర్య కిరణాల్లోని కాల్షియం ఎముకలకు మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం మహిళలు ఉదయం వేళ వాకింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదయం కుదరని వారు మాత్రమే సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో పలు వాకర్స్ క్లబ్‌లు ఏర్పడ్డాయి. వృద్ధుల నుంచి పిల్లల వరకు క్లబ్‌లు ఏర్పాటు చేసుకుని వాకింగ్, యోగా చేస్తున్నారు. వయస్సును బట్టి రోజుకు 30 నిమిషాల నుంచి గంటలోపు వాకింగ్ చేయాలని వైద్యులు చెబుతున్నారు.



రోగాలు దరి చేరవు

వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి తగ్గడంతో వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుంది. బీపీ, షుగర్ వ్యాధులు సోకిన రోగులు నిత్యం వాకింగ్ చేయడంతో శరీరంలో కండరాలు, ఎముకలు గట్టి పడి ఆరోగ్యంగా కనిపిస్తారు. వాకింగ్ చేసిన వ్యక్తి నిత్యం యువకుడిలా కనిపిస్తాడు.

– లింగం శ్రీనివాస్, వాకర్, సరస్వతీ పార్కు


సరస్వతీ పార్కులో వాకింగ్ చేస్తున్న వాకర్లు



జీవిత కాలం పెరుగుతుంది..

నా వయసు 51 సంవత్సరాలు. నిత్యం వాకింగ్ వల్ల జీవిత కాలం పెరిగి యువకుడిలా పనులు చేయగలుగుతున్నాను. ఎన్నో ఏళ్లుగా వైఎస్సార్‌సెంట్రల్ పార్క్ చుట్టూ ఉదయం వేళల్లో వాకింగ్ చేస్తున్నాను. ఇప్పటి వరకు ఎటువంటి వ్యాధుల బారిన పడలేదు. మంచి ఆహారం తీసుకుంటున్నాను.

– పసగాడ రామలింగేశ్వరరావు, వాకర్, వైఎస్సార్ సెంట్రల్ పార్క్

నడకతో ప్రయోజనాలు..

- విటమిన్ డి లోపం ఉండదు. క్యాన్సర్ వ్యాధి సోకదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- మెదడు చురుగ్గా పని చేస్తుంది.
- మానవుని జీవిత కాలం పెరుగుతుంది.
- రక్తంలోని కొవ్వు కరుగుతుంది.
- ఎముకలు దృఢంగా తయారవుతాయి.
- శరీరానికి మంచి శ్వాస, అధిక స్థాయిలో ఆక్సిజన్ అందుతుంది.
- క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది.
- మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి వాటిని అధిగమించవచ్చు.
- శరీర ఆకృతి బాగుంటుంది. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పని చేస్తాయి.
- గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం, నరాల బలహీనత వంటివి దరి చేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను జయించవచ్చు.
- కీళ్లనొప్పులు తగ్గి, కండరాలు శక్తి పెరిగి నడిచేందుకు వీలు కలుగుతుంది.



నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

వైభవంగా కొత్తమ్మవారి పుట్టబంగారం పండగ


అమ్మవారి పుట్ట బంగారం తీసుకొచ్చేందుకు వెళ్తున్న భక్తులు

అల్లిపురం: అమ్మవారి వీధి ప్రజల ఆరాధ్య దైవం కొత్తమ్మవారి జాతరలో భాగంగా సోమవారం అమ్మవారి పుట్ట బంగారం వేడుక వైభవంగా నిర్వహించారు. అమ్మవారి దేవాలయం నుంచి భక్తులు బాజా భజంత్రీలు, మందుగుండు సామగ్రితో తిరువీధిగా వైర్లెస్ కాలనీలో గల శ్రీ రామాలయంలో గల సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడున్న పుట్టకు పూజలు చేసి అక్కడి నుంచి పుట్టబంగారం తోడ్కొని తిరిగి మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి వీధి కొత్తమ్మవారి దేవాలయానికి చేరుకుని పుట్టబంగారాన్ని ఆలయంలో కొలువుదీర్చారు.

చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు


సాయి కీర్తనను తల్లి రేవతికి అప్పగిస్తున్న టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు, ఏఎస్ఐ కాంతం

అల్లిపురం: తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతున్న ఏడేళ్ల చిన్నారిని టూటౌన్ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం రాగోలు సాయి కీర్తన అనే ఏడేళ్ల చిన్నారి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో పాత జైలురోడ్డు దరి గొల్లలపాలెం వద్ద రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతోంది. అదే సమయంలో టూటౌన్ బ్లూకోట్స్ కానిస్టేబుల్ శివ చూసి అమ్మాయి నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె తన ఊరు కొత్తపల్లి అని చెప్పింది కానీ తల్లిపేరు, ఇంటి అడ్రస్ చెప్పలేకపోయింది. దీంతో టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు సలహా మేరకు వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేశారు. అమ్మాయి తల్లి రాగోలు రేవతి తన భర్తను ఏడేళ్లుగా విడిపోయి కుమార్తె, తల్లితో కలిసి రామా టాకీస్ వద్ద వినాయకనగర్‌లో నివసిస్తూ ఒక హాస్టల్లో వంట మనిషిగా పని చేస్తోంది. సోమవారం ఉదయం ఎవరో చనిపోతే అక్కడికి తన తల్లితో కలిసి వెళ్లింది. సాయి కీర్తన ఒక్కతే ఇంట్లో ఉంది. ఎవరూ కనపడకపోవటంతో సాయి కీర్తన ఏడ్చుకుంటూ బయటికి వచ్చింది. వారింటి దగ్గర ఎవరో ఒక బొమ్మ ఉంటే అక్కడికి వెళ్లింది. వారు దెబ్బలాడటంతో రామా టాకీస్ నుంచి గొల్లలపాలెం చేరుకుంది. ఇంటికి వచ్చిన పాప తల్లి రేవతికి కుమార్తె కనిపించక పోవటంతో ఏడుస్తూ వెదకడం మొదలుపెట్టింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. ఇంతలో ఎవరో వాట్సప్‌లో ట్రెండ్ అవుతున్న ఫొటోలను ఆమెకు చూపించటంతో తన కుమార్తెగా గుర్తించింది. దీంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. పాప తల్లిని గుర్తించడంతో సీఐ ఎర్రంనాయుడు పాపను తల్లికి అప్పగించారు. తన కుమార్తెను సంరక్షించినందుకు ధన్యవాదాలు రేవతి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.

కళాకారులకు చార్జీలు చెల్లించాలి


పోర్టు ముఖద్వారం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కళాకారులు

జగదాంబ: పోర్టు అథారిటీ పరిధిలోని గోడలపై వేసిన కళా రూపాల (బొమ్మలు)కు కాంట్రాక్టర్‌కి చెల్లించాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం పోర్టు ముఖద్వారం ఎదురుగా సీఐటీయూ నాయకుడు వై.రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుమారు సంవత్సర కాలంగా లక్షా డెబ్బై వేల చదరపు అడుగుల్లో కళారూపాలు వేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రూ. 11 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ పనుల్లో అనేక మంది చిత్రకారులు కష్టపడ్డారన్నారు. అయితే అయిదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పోర్టు అధికారులు డబ్బులు చెల్లించలేదన్నారు. ఈ విషయంపై పోర్టు చైర్మన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీని వల్ల అనేక మంది చిత్రకారుల కుటుంబాలు రోడ్డున పడ్డామన్నారు. పోర్టు అధికారులు ఇప్పటికైనా కళాకారుల డబ్బులు చెల్లించాలని, లేని పక్షంలో లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు నగరంలో కళాకారులతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్బారావు, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోగులకు మరింతగా సేవ చేయాలి


కేజీహెచ్ నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరిని సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

మహారాణిపేట: ఉద్యోగులకు పూర్తి సహకారం అందిస్తామని కేజీహెచ్ నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి అన్నారు. సోమవారం ఇక్కడి వైఎస్సార్‌టీయూసీ యూనియన్, కేజీహెచ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు నూతన సీఎస్ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ పేషెంట్లకు మరింతగా సేవ చేయాలని, ఆస్పత్రికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు, కార్యదర్శి సురుపల్లి రాజారావు, ఉపాధ్యక్షులు వెంకట్రావు, పార్వతి, జాయింట్ క్యాషియర్ బేగం, జయ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఒ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం


జగదాంబ జంక్షన్‌లోని ఓ దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న జీవీఎంసీ అధికారులు

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపార సముదాయాలపై జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బృందాలు దాడులు నిర్వహించాయి. సోమవారం జీవీఎంసీ 31, 32, 33 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జగదాంబ పరిధిలోని దుకాణాల్లో దాడులు చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 31వ వార్డు ఇన్‌స్పెక్టర్ కామేష్‌రెడ్డి మాట్లాడుతూ మానవాళికి హాని కలిగించే నిషేధిత ప్లాస్టిక్‌పై జీవీఎంసీ నిషేధం విధించిందన్నారు. అయినప్పటికీ వ్యాపారులు ఉపయోగిస్తూనే ఉన్నారన్నారు. చిరు వ్యాపారుల వద్ద ఎక్కువగా అటువంటి కవర్లు ఉంటున్నాయని చెప్పారు. అధికారుల ఆదేశాల మేరకు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు దొరికితే వెంటనే ఆయా దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలు ఆగస్టులోనే నిర్వహించాలి

తగరపువలస: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ప్రతి ఆరు నెలలకు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలను ఏటా మాదిరిగా ఆగస్టులోనే నిర్వహించాలని రాష్ట్ర టైప్‌రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ సభ్యుడు బల్లా వెంకటరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ జూలైలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది మార్చిలో పాస్ అయిన విద్యార్థుల జాబితాలు ఇంకా సంస్థలకు చేరలేదన్నారు. తక్కువ వ్యవధి కారణంగా విద్యార్థుల సంఖ్య ఆశించినంతగా లేదన్నారు. గతంలో మాదిరే ఈసారి కూడా ఆగస్టులోనే టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించాలని కోరారు.

మానసిక రోగుల చికిత్స కేంద్రం సందర్శన


కేంద్రంలో పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

బీచ్‌రోడ్డు: చినవాల్తేరులోని మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. మానసిక రోగుల స్థితి, వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రంజింపజేసిన సినీ సంగీత విభావరి


సినీ గీతం పాడుతున్న గాయకుడు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా స్వరాంజలి, స్వరార్చన కళా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సంస్థ గాయనీ గాయకులు అంబిక, కల్యాణి, రంజిత, సుజాత, ఎం.కృష్ణంరాజు, భూమతిరావు, నరసింగరావు తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు.

బాధిత కుటుంబానికి అండ


వాసుపల్లితో కలిసి ఉద్యోగ సిఫారసు లెటర్ అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులో ఓ పేద కుటుంబానికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అండగా నిలిచారు. ఈ మేరకు బాధితురాలు విస్సారపు నాగమణికి జీవీఎంసీలో ఉద్యోగం కల్పిస్తూ ఇచ్చిన సిఫారసు లేఖను మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ హయాంలో 2022 జూన్ 11న జ్ఞానాపురం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో విద్యుత్ షాక్‌తో నాగమణి కుమారుడు చైతన్య (8) మృతి చెందాడు. అప్పటి నుండి కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్ వారికి అండగా నిలిచారని తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ సంస్థ ద్వారా బాధితులకు రూ.5 లక్షలు ఆనాడు అందజేశారు. ప్రమాదవశాత్తు జరిగిన విపత్తుల్లో బాధితులకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమే అన్నారు. కూటమి ప్రభుత్వానిది రాక్షస పాలన అని ఏడాదిలోనే ప్రజలకు తెలిసిపోయిందన్నారు. వాసుపల్లి హయాంలో వార్డులో సుమారు రూ. 11 కోట్లకు పైగా అభివద్ధి పనులు జరిగాయని వార్డు కార్పొరేటర్ పూర్ణిమ తెలిపారు. ఆయన సహకారంతోనే బాధిత కుటుంబానికి అండగా నిలిచామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు వేళంగిణిరావు, ఆనంద్, పాత్రపల్లి సునీల్‌కుమార్, మధు, మురళి, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ డిగ్రీ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు


ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు

డాబాగార్డెన్స్: ఏయూ డిగ్రీ ఫలితాల్లో ఆదిత్య కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ప్రకటించిన డిగ్రీ కోర్సు వివిధ విభాగాల్లో 1, 2, 3 ర్యాంక్‌లతో పాటు మొత్తం 12 ర్యాంకులు ఆదిత్య కైవసం చేసుకున్నారని చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి తెలిపారు. బీసీఏ విభాగం నుంచి దున్నా ధనలక్ష్మి మొదటి ర్యాంకు, అమ్‌జూర్ పావని సెకండ్ ర్యాంక్, పెన్మత్స క్యాతిశ్రీ సెకండ్‌ర్యాంకు, బొడుపు శిరీష థర్డ్ ర్యాంకు, గంగు రిపిక థర్డ్‌ర్యాంక్ (మొదటి మూడు ర్యాంకులు) ఆదిత్య విద్యార్థులు కైవసం చేసుకోగా, బీబీఏ విభాగం నుంచి కొరిపోలు మహిత సెకండ్ ర్యాంకు, వానపల్లి మౌనిక థర్డ్ ర్యాంకు, గుండ్రు వెంకటసాయి కీర్తి థర్డ్‌ర్యాంకు సాధించగా, బీఎస్సీ విభాగం నుంచి మండల యమున ఫస్ట్ ర్యాంక్, సత్తి మోనిక విశాల్ థర్డ్ ర్యాంక్, బీకాం నుంచి పల్లేటి పల్లవి థర్డ్‌ర్యాంకు, ప్రిసింగ్ హరిప్రియ సెకండ్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. బీఎస్సీలో 2, బీకాంలో 2 ర్యాంకులు కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్. ధనుంజయరావు అభినందించారు.

భద్రతలో భేష్.. ఆర్టీసీ సిబ్బంది


ప్రయాణికుడికి భద్రంగా అతని బ్యాగ్ అప్పగిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్, హెడ్‌గార్డ్ నారాయణ

డాబాగార్డెన్స్: ఆర్టీసీలో ప్రయాణించండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి. మీ భద్రత మాదే నన్న ఆర్టీసీ కొటేషన్లకు సిబ్బంది ప్రయాణికుల భద్రత విషయంలో జాగ్రత్తగానే ఉన్నారనడానికి సోమవారం ద్వారకా బస్ స్టేషన్ వద్ద జరిగిన సంఘటనే నిదర్శనం. తూర్పుగోదావరి జిల్లా నారాయణపురం, పెద్దాపురానికి చెందిన ఆర్.శ్రీనివాసరావు అనే ప్రయాణికుడితో పాటు మరో ముగ్గురు పెద్దలు, ముగ్గురు పిల్లలు విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లేందుకు ద్వారకా బస్ స్టేషన్‌కు సుమారు ఒంటి గంట ప్రాంతంలో చేరుకుని ఏపీ31జెడ్0381 నంబరు గల బస్సు ఎక్కారు. మధురవాడ వద్దకు వెళ్లే సరికి బ్యాగ్ మిస్సయిందని గుర్తించారు. ఈ విషయాన్ని ఆ బస్సు డ్రైవర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైవర్ ద్వారకా బస్ స్టేషన్ మేనేజర్‌కు ఫోన్ చేశారు. స్టేషన్ మేనేజర్ వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి ప్రయాణికుడి బ్యాగ్ మిస్సయిందన్న విషయం చెప్పగా.. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే బ్యాగ్ ఆచూకీ కనుగొన్నారు. ప్లాట్‌ఫాం నంబరు 2 వద్ద బ్యాగ్‌ను గుర్తించి భద్రపరిచారు. బ్యాగ్ మిస్సయిన ప్రయాణికుడికి ఫోన్ చేసి బ్యాగ్ ఏ రంగులో ఉంది? బ్యాగులో ఏ సమాన్లు ఉన్నాయి? వంటి వివరాలు అడిగి సెక్యూరిటీ హెడ్ గార్డ్ నారాయణ సమక్షంలో ఆ బ్యాగ్‌ను స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ ప్రయాణికుడికి అందజేశారు.

ఆలోచింపజేసిన ఎయిడ్స్‌పై నృత్య రూపకం


బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ వద్ద జానపద నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఏయూక్యాంపస్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ జానపద నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. బీచ్ రోడ్డులోని సబ్‌మెరైన్ మ్యూజియం ఎదురుగా సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ కళారత్న కళాపరిషత్ బృందం ప్రజలను ఆలోచింపజేసేలా హెచ్ఐవీ–ఎయిడ్స్‌పై కళా రూపకాన్ని ప్రదర్శించింది. హెచ్ఐవీ వ్యాప్తి చెందడానికి అవకాశమున్న అంశాలను వివరించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మురికివాడలు, జనసమ్మర్దం ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సమిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు డి.వీరభద్రరావు, ఎస్.వి.వి.ప్రసాద్ రెడ్డి, కళాకారులు వై.కె రాజు, ధనలక్ష్మి, డప్పు బాలు, ఓలేటి శంకర్, ఈశ్వర రావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com